అలరించిన నృత్య ప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం విపంచి స్కూల్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్, నృత్య నిర్వాణ కళాకారులు కామాక్షి ప్రదీప్, దీపశిఖ, పూర్ణిమ, తపస్వి, వేదం గాయత్రి, కావ్య ప్రమీల తదితరులు కౌత్వం, జతిస్వరం, సిద్ధి వినాయకం, భామాకలాపం, పరుల స్నమాట, బృందావనం తదితర అంశాలను ప్రదర్శించారు. అనంతరం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శిల్పారామం ఆవరణలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో తెలంగాణ పోలీస్ డిపార్ట్‌మెంట్, ఇండియన్ మిలటరీ సంయుక్త నిర్వహణలో మిలటరీ, పోలీస్‌బ్యాండ్‌ను ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు.

అన్నమయ్యపురంలో స్వరార్చన

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం శృతిలయ మ్యూజిక్ అకాడమీ గురువు శివరంజని శిష్య బృందం స్వరార్చన అలరించింది. ఇందులో వక్రతుండ మహాకాయ, జయగణనాయక, నారాయణతే నమోనమో, బ్రహ్మమొక్కటే తదితర కీర్తనలు ఆలపించారు. కళాకారులు సాయిప్రణవి, సుజాత, హర్షిణి, హారిక, తరంగిణి, అశ్విత, కేసరి, జాహ్నవి తదితరులు పాల్గొన్నారు. కళాకారులను డాక్టర్ శోభారాజ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.



మందకొడిగా పనులు

- పూర్తిస్థాయిలో సమస్య పరిష్కారమయ్యేదెన్నడు..?
- ఆర్‌ఓబీ నిర్మించాలని ప్రజల డిమాండ్

లింగంపల్లి ఆర్‌యూబీ వద్ద బాక్స్‌టైప్ డ్రైయిన్ పనుల్లో జాప్యం



శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి కింద వరదనీటి సమస్య పరిష్కారానికి చేపట్టిన బాక్స్‌టైప్ డ్రైయిన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ఎప్పటికి పూర్తయ్యేనంటూ స్థానికులు నిట్టూరుస్తున్నారు. ప్రధానంగా రైల్వే అండర్‌బ్రిడ్జి కింద చిన్నపాటి వర్షానికి వర్షపునీరు చేరడం, రెండురోజుల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోవడం దశాబ్దాలుగా నెలకొన్న సమస్య. ఈ సమస్య పరిష్కారానికి బాక్స్‌టైప్ డ్రైయిన్, కల్వర్టు నిర్మాణం చేపట్టారు. కానీ పనుల్లో జాప్యం జరుగుతుండడంతో ఈ ఏడాది వర్షాకాలం కూడా సమస్య తీరలేదు.

వలు ప్రాంతాలకు అనువైన మార్గం

నగరం నలువైపులకు వెళ్లడానికి ఇది ఎంతో అనువైన మార్గం కావడంతో రాకపోకలు ఎక్కువ. కానీ ఇక్కడ ప్రతి వర్షాకాలం ఇబ్బందులు వస్తున్నాయి. ముఖ్యంగా లింగంపల్లి, మియాపూర్, చందానగర్, ఆర్‌సీపురం, పటాన్‌చెరు, హుడాకాలనీ, లింగంపల్లి తదితర ప్రాంతవాసులకు ఈ మార్గం దగ్గర కావడంతో సహజంగానే రద్దీ ఉంటుంది. ఇక్కడి ప్రజలు నగరానికి, ఔటర్ రింగురోడ్డు, ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతం, హైదరాబాద్ నాలెడ్జి సిటీ, రాయదుర్గం, మెహిదీపట్నం, నార్సింగి తదితర ప్రాంతాలకు నిత్యం రాకపోకలు చేస్తుంటారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు రద్దీ నెలకొంటుంది. వేలాది వాహనాల రాకపోకలు సాగించే రోడ్డు కావడంతో వర్షాకాలం వచ్చిందంటే ఎప్పుడు రాకపోకలు నిలిచిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సమస్య శాశ్వత పరిష్కారానికి అధికారుల బృందం సర్వే చేసి మూడు విధానాలను ప్రతిపాదించారు.

- లింగంపల్లి- తారానగర్ ప్రధాన రోడ్డులో వరద నీరు వెళ్లేందుకు బాక్స్ టైప్ డ్రైన్ నిర్మాణం
- లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వెళ్లే డ్రైన్‌ను రీ మోడల్ చేయడం
- లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఓవర్ ఫ్లో అయ్యే వరద నీరు వెళ్ళేందుకు ప్రత్యేకంగా వెంకట్‌రెడ్డి కాలనీ మీదుగా డ్రైన్ నిర్మించాలని సూచించారు. ఈ మూడు సూచనలు అమలు చేస్తే చాలా వరకు సమస్య పరిష్కారం అయినట్లే. లేదా ఆర్‌ఓబీ నిర్మిస్తే ఏ సమస్య ఉండదని స్థానికులు, వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.
- అధికార బృందం సూచనల మేరకు ఇంజనీరింగ్ అధికారులు మొదటిదాన్ని పూర్తి చేశారు.
- రెండవ సూచనలో భాగంగా పనులు ప్రారంభించారు. వాటిలో కొంత పూర్తి కాగా, అండర్ బ్రిడ్జి వద్ద పనులు నిలిచిపోయాయి.
- మూడవది వెంకట్‌రెడ్డి కాలనీ మీదుగా లైన్ వేసేందుకు జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు కాలనీవాసులతో మాట్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాదికైనా పనులు పూర్తవుతాయా అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.





కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 40, పచ్చిమిర్చి 50, బెండ 70, కాకర 60, దొండ 45, దోస 50, ఆలు 40, చామ 50, కీర 30, బీర 70, వంకాయ 50, గోకర 60, బీన్స్ 150, బీట్‌రూట్ 60, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 35, క్యారెట్ 60, చిక్కుడు 100, ఉల్లి 60(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 150, వెల్లుల్లి 400.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి



ఎమ్మెల్యే గాంధీని కలిసిన స్ప్రింగ్ వ్యాలీ అసోసియేషన్ సభ్యులు

గచ్చిబౌలి: స్ప్రింగ్ వ్యాలీ కాలనీలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి స్ప్రింగ్ వ్యాలీ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విన్నవించారు. శనివారం అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. స్ప్రింగ్ వ్యాలీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్ప్రింగ్ వ్యాలీ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రత్న ప్రసాద్, ఉపాధ్యక్షులు గుమ్మడి సాయిచౌదరి, డీవీఎస్ మనోజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరుపత్రం అందజేత



మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్‌పేట్‌కి చెందిన వహిద్ అలీకి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన రూ.2.50 లక్షలు పత్రాలను శనివారం ఎమ్మెల్యే గాంధీ బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖాసీం, జుబేదా బేగం, వహిద్ అలీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'యాభై శాతం కేన్సర్ బారినపడుతున్నారు'

మాదాపూర్: భారతదేశంలో 2.5 మిలియన్ల మంది కేన్సర్‌తో బాధపడుతున్నారని, ప్రతి సంవత్సరం 1.5 మిలియన్ల కొత్త కేసులు నిర్ధారణ అవుతున్నాయని పాలియేటివ్ కేర్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరామ్ తెలిపారు. శనివారం మాదాపూర్ అవాస హోటల్‌లో నందేడ్కర్ జ్ఞాపకార్థం సింపోజియం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్లు కేన్సర్, పాలియేటివ్ కేర్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరామ్ యెన్ను, డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ 50శాతం మంది కేన్సర్‌కి గురవుతున్నారని తెలిపారు. ఎక్కువ మంది 4వ దశలో ఉంటున్నట్టు తెలిపారు. ఇలాంటి సమయంలో రోగికి నయం కాదని తెలిపారు. పాలియేటివ్ కేర్ అవసరమయ్యే కేన్సర్ రోగులు ఎక్కువగా ఉన్నట్టు తెలిపారు. కేన్సర్ రోగులలో అలసటకు కొత్త చికిత్స, పిల్లలలో దీర్ఘకాలిక నొప్పిలో ధోరణులు, ఆధారాలు, భారతదేశంలో పాలియేటివ్ కేర్ అభివృద్ధి తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్ సుష్మాభట్నాగర్, డాక్టర్ సురేష్ కె.రెడ్డి, డాక్టర్ నందిని వల్లత్, డాక్టర్ ప్రణీత్ సువ్వావి తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా మౌలిక వసతుల కల్పన



గోపన్‌పల్లితండాలో పర్యటిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గోపన్‌పల్లితండాలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లి తండాలో శనివారం ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తండాలో సీసీ రోడ్ల నిర్మాణం, యూజీడీ పైప్‌లైన్ ఏర్పాటు, మంచినీటి వసతిని మెరుగుపరుస్తామన్నారు. అన్ని కాలనీలకు దశలవారీగా మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ దుర్గాప్రసాద్, డీఈ విశాలాక్షి, ఏఈ రషీద్, వర్క్ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, సీనియర్ నాయకులు ప్రకాశ్‌నాయక్, గోవర్ధన్, నాయకులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల పరిశీలన

కేశవనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తెలిపారు. గచ్చిబౌలి డివిజన్‌లోని కేశవనగర్‌లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం హెచ్‌ఎం సునీతతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మంచినీటి సౌకర్యం, ప్రహరీగోడ, వలంటీర్ల అవసరం, పాఠశాల గేటు మరమ్మతులు, విద్యుత్ సదుపాయాలు తదితర అంశాలను హెచ్‌ఎం ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, భిక్షపతి, కిషన్, ప్రసాద్, సునీల్, సురేష్, రాజు, శ్రీను పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న జగదీశ్వర్‌గౌడ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆయా డివిజన్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జ్ జగదీశ్వర్‌గౌడ్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన జడ్సీని కలిసి వినతిపత్రం అందజేశారు. మాదాపూర్, గచ్చిబౌలి, హఫీజ్‌పేట్, లింగంపల్లి, చందానగర్, మియాపూర్ డివిజన్ల పరిధిలో నెలకొన్న సమస్యలను జడ్సీ దృష్టికి తీసుకెళ్లారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సైబర్ మోసం..

రూ.20 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి బురిడీ వేసి భారీగా నగదు కాజేశారు సైబర్ నేరగాళ్లు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి సెప్టెంబర్ 23వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. లింకును ఓపెన్ చేసి తన వివరాలను నమోదు చేశారు. దీంతో అపరిచిత ట్రేడింగ్ నిర్వాహకులు ఐడిని క్రియేట్ చేసి ఇచ్చారు. అతను నగదును ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు.పెట్టిన పెట్టుబడి, లాభాలు చూపిస్తూ వచ్చారు. పలు దఫాలుగా బాధితుడు మొత్తం రూ.20 లక్షల 60 వేలు ఇన్వెస్ట్ చేశాడు. తాను పెట్టిన నగదుతో పాటు, వచ్చిన లాభాలు ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లుగా గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.ఈ మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సందడిగా కౌశల్య ఉత్సవం





ప్రదర్శనలను పరిశీలిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

గచ్చిబౌలి: విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసే కౌశల్య ఉత్సవం సందడిగా సాగింది. శనివారం కొండాపూర్‌లో సంస్కృతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల ఆహార పదార్థాలు, డ్రాయింగ్, పెయింటింగ్స్ ప్రదర్శించారు. ఉత్పత్తులను విక్రయించగా, ఎంట్రీ ఫీజుగా వచ్చిన మొత్తాన్ని అనాథాశ్రమానికి విరాళంగా అందిస్తామని సంస్కృతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సురేందర్ తెలిపారు. కార్యక్రమంలో సంస్కృతి కళాశాల డైరెక్టర్లు రేవతి రాజు, యామినీరాజు తదితరులు పాల్గొన్నారు.

నాలా విస్తరణ జరిగేలా చర్యలు తీసుకోవాలి



జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న రవికుమార్ యాదవ్

గచ్చిబౌలి: వర్షపు నీటి నాలా సమస్యను పరిష్కరించాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డికి శనివారం బీజేపీ శేరిలింగంపల్లి ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ విన్నవించారు. జడ్సీని కలిసిన ఆయన శేరిలింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వర్షపు నీటి నాలా సమస్యను వివరించారు. వర్షం వచ్చినప్పుడు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయని తెలిపారు. నాలా విస్తరణ చేయకుండా డ్రెయిన్ మళ్లింపు పనులు చేపట్టడంతో స్థానిక కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని పేర్కొన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని జెడ్సీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎల్లేష్, స్థానికులు కృష్ణారెడ్డి, సుదర్శన్‌రావు, రాజిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.

క్షేత్ర పర్యటనలతో మరింత అవగాహన

పటాన్‌చెరు టౌన్: క్షేత్ర పర్యటనలతో విద్యార్థులకు మరింత అవగాహన వస్తుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ అన్నారు. పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్యశాఖ విద్యార్థులు బండ్లగూడలో ఉన్న శ్రీ టెక్నాలజీస్ ఇండస్ట్రీని శనివారం సందర్శించారు. పరిశ్రమ లక్ష్యాలు, మేనేజ్‌మెంట్ ,పరిశ్రమలో తయారు చేస్తున్న పరికరాల వివరాలు ,ఆర్థిక లావాదేవీలు, రికార్డులు, మార్కెటింగ్ పద్ధతులు, పనిచేస్తున్న సిబ్బంది తదితరాల గురించి ఇండస్ట్రీ మేనేజింగ్ డైరెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ యోగిబాబు, డాక్టర్ బేబీ రమణ పాల్గొన్నారు.

ఘనంగా గరుడవాహన సేవ



చందానగర్: చందానగర్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు శనివారం ఉదయం 7.30 గంటలకు నిత్యోపాసన, 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ఉత్సవాస్త స్నపనం, 10 గంటలకు దుష్టగ్రహ నివారణార్థం శ్రీ మహా సుదర్శన హోమం, మధ్యాహ్నం 12 గంటలకు హారతి, తీర్థ ప్రసాదములు, సాయంత్రం 6.30 గంటలకు నిత్యోపాసనం, 7.30 గంటల నుంచి గరుడవాహన సేవ, సహస్ర దీపాలంకరణ సేవలు నిర్వహించారు. ఈ గరుడవాహన సేవలో భారీ సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఉమంగ్' క్రీడా దినోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: సాధన ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో 'ఉమంగ్' పేరుతో వార్షిక క్రీడా దినోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా క్రీడలు, విభిన్న శ్రేణి అథ్లెటిక్ ఈవెంట్లు, శక్తివంతమైన ప్రదర్శనలతో ఈ వేడుక నిర్వహించారు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిలో క్రీడా సాధకులను సంస్థ చైర్మన్ సునంద్ సూరపనేని, మేనేజింగ్ డైరెక్టర్ కుమారి సాధనదేవి సూరపనేని సన్మానించారు. కేంబ్రిడ్జి 1 నుంచి 8 తరగతులు, సీబీఎస్ఈ 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. జుంబా డాన్స్, ఫ్లవర్ డ్రిల్, కరాటే తదితరాల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. కార్యక్రమంలో సాధన ఇంటర్నేషనల్ స్కూల్ అడ్మిన్ డైరెక్టర్ జీ మురళీమోహన్, సీబీఎస్ఈ ప్రిన్సిపాల్ శోభ్నా శిరోహి, సీఏఐఈ ప్రిన్సిపాల్ సరిత కుమార్, వైస్ ప్రిన్సిపాల్ మాధవి లత, అకడమిక్ హెడ్ శిరీష కొల్లి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై 11 వినతులు



పరిష్కార వేదికలో వినతిపత్రాలు అందజేస్తున్న వినియోగదారులు

చందానగర్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను శనివారం చందానగర్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించారు. ఇందులో విద్యుత్ సమస్యలపై 11 వినతులు అందాయని సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్, టెక్నికల్, ఫైనాన్స్, కన్స్యూమర్ అఫైర్స్ సభ్యులు బి.లలిత, కె.శోభారాణిలు తెలిపారు. ఈ పరిష్కార వేదికలో హఫీజ్‌పేట్, చందానగర్, వసంత్‌నగర్ సెక్షన్లలో దీర్ఘకాలంగా ఉన్న 11 విద్యుత్ సమస్యలు, విద్యుత్ బిల్లులు హెచ్చుతగ్గులు తదితర సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ యాదగిరి, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

24 రోజుల్లో 700 టన్నుల వ్యర్థాల తొలగింపు..!

90రోజుల ప్రత్యేక కార్యాచరణ

- ఇప్పటి వరకు 12బృందాలతో 570 మ్యాన్‌హోళ్లు శుభ్రం
- డిసెంబర్ 31 వరకు కొనసాగనున్న కార్యక్రమం

బంజారాహిల్స్: సీవరేజీ ఓవర్‌ఫ్లో ఫ్రీ సిటీ, భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా జలమండలి చేపట్టిన 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జలమండలి డివిజన్-6 పరిధిలో సీవరేజీ పైప్‌లైన్ల వ్యర్థాల తొలగింపు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఈ నెల 2వ తేదీ గాంధీ జయంతి రోజు ప్రారంభమైన 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఇప్పటివరకు జలమండలి డివిజన్-6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, రహమత్‌నగర్, బోరబండ, సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్ల పరిధి కిందికి వచ్చే ఫిలింనగర్, ఎల్లారెడ్డిగూడ, ఎస్‌ఆర్‌నగర్, బోరబండ, ఫతేనగర్, సోమాజీగూడ, జూబ్లీహిల్స్, వెంకటగిరి, బంజారాహిల్స్, ఎస్పీఆర్‌హిల్స్, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, తట్టిఖానా సెక్షన్ల పరిధిలో ఇప్పటి వరకు 700 టన్నుల వ్యర్థాలను తొలగించారు. ప్రతిరోజూ 30 టన్నుల మేర వ్యర్థాలను తొలగిస్తూ సిల్ట్ కార్టింగ్ డీ సిల్టింగ్ వాహనాల ద్వారా తరలిస్తున్నారు. ఇందు కోసం 12 బృందాలు ఏర్పాటు చేశారు. ఒక్కో సెక్షన్ పరిధిలో ఒక్కో బృందం నిర్విరామంగా పనిచేస్తుంది. మ్యాన్‌హోళ్ల నుంచి, పైపుల నుంచి సిల్ట్ తీయడానికి 36 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

12 సిల్ట్ కార్టింగ్ వెహికల్స్ ద్వారా ఈ తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. డివిజన్-6 పరిధిలో 740 కిలోమీటర్ల మేర సీవరేజీ పైప్‌లైన్లు ఉన్నాయి. ఇందులో 80 కిలోమీటర్ల మేర సమస్యాత్మక పైప్‌లైన్లు ఉన్నట్లుగా గుర్తించారు. కార్యాచరణ ప్రణాళికలో ఈ 80 కిలోమీటర్ల మేర వ్యర్థాలు, బురద తొలగించాలని తలపెట్టారు. ఇప్పటి వరకు 18 కిలోమీటర్ల మేర సిల్ట్ తొలగించారు. అంతేకాకుండా 570 మ్యాన్‌హోల్స్‌ను ఇప్పటి వరకు క్లీన్ చేశారు. డివిజన్-6 పరిధిలో మొత్తం 30వేల మ్యాన్‌హోల్స్ ఉండగా ఇందులో సమస్యాత్మకంగా 1800 డీప్ మ్యాన్‌హోల్స్ ఉన్నాయి.

డిసెంబర్ 31 వరకు కొనసాగుతుంది

హరిశంకర్, జీఎం,జలమండలి డివిజన్-6

సీవరేజీ పైప్‌లైన్ల నుంచి సిల్ట్ తొలగించడంతో పాటు మ్యాన్‌హోళ్లను క్లీన్ చేయడమే లక్ష్యంగా ఈ నెల 2వ తేదీన ప్రారంభమైన 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ డిసెంబర్-31 వరకు కొనసాగుతోంది. ఇందులో భాగంగా సీవరేజీ పైప్‌లైన్ల నుంచి వ్యర్థాలను తొలగిస్తూ వాటిని సిల్ట్ కార్టింగ్ వాహనాల ద్వారా తొలగిస్తున్నాం. మా పరిధిలో ఉన్న 12 సెక్షన్ల పరిధిలో 12 వెహికల్స్ ఉండగా ఒక్కో వెహికల్ రోజుకు మూడు టన్నుల వ్యర్థాలను తొలగిస్తున్నది. కార్టింగ్ వెహికల్‌లో రిమూవర్ స్టాఫ్ నిరంతరంగా పనిచేస్తున్నారు. ఈ ప్రక్రియ ద్వారా సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యకు చెక్ పెట్టనున్నాం. ఇప్పటికే చాలా మ్యాన్‌హోళ్ల నుంచి వ్యర్థాలతో పాటు బురద, మట్టి, రాళ్లు, ఇతర వస్తువులను తొలగించడం జరిగింది. మ్యాన్‌హోళ్లతో పాటు పైప్‌లైన్లలో చిక్కుకున్న ఈ వ్యర్థాలతో మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతూ సీవరేజీ రోడ్లపై పారుతూ పారిశుధ్య సమస్య తలెత్తడంతో దీని పైనే దృష్టి ఎక్కువ కేంద్రీకరించాం.

రహదారి భద్రతపై ఎస్‌సీఎస్‌సీ కృషి ప్రశంసనీయం

- సైబరాబాద్ జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్
- ట్రాఫిక్ వలంటీర్లకు సన్మానం

రాయదుర్గం: సైబరాబాద్‌లో రహదారి భద్రతలో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) చేస్తున్న కృషి ప్రశంసనీయమని సైబరాబాద్ జాయింట్ కమిషనర్ (ట్రాఫిక్) డి జోయెల్ డేవిస్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో ఎస్‌సీఎస్‌సీ ఆధ్వర్యంలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ట్రాఫిక్ వలంటీర్లను ఘనంగా సత్కరించి అవార్డులు అందజేశారు. ఎస్‌సీఎస్‌సీ సెక్రటరీ జనరల్ రమేష్‌కాజా మాట్లాడుతూ విధుల్లో నిబద్ధత చూపిన వారిని గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా 160 మంది వలంటీర్లు, స్వచ్ఛంద సేవకులు, వివిధ సంస్థలు , ఆస్పత్రులు, విద్యార్థులు, సోషల్ మీడియా ప్రతినిధులను సత్కరించడంతో పాటు అవార్డులను అంద చేశారు. కార్యక్రమంలో ఎస్‌సీఎస్‌సీ ట్రాఫిక్ ఫోరం జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, ట్రాఫిక్ కో లీడ్ ఫనో నవీద్‌ఖాన్, ఎస్‌సీఎస్‌సీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు రాజేష్ ప్రసంగించారు.



ట్రాఫిక్ వలంటీర్లతో జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్, సెక్రటరీ జనరల్ రమేష్‌కాజా

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ గ్రీన్‌పార్కు వాకర్స్ అసోసియేషన్ కన్వీనర్ బాలాజీ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య సిబ్బందికి శనివారం దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమానికి రామాలయ పాలక మండలి సలహాదారులు శ్రీరామచంద్రమూర్తి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్‌లు మాట్లాడుతూ మనం ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు శుభ్రంగా ఉండాలన్నారు. కాలనీలు, బస్తీలు శుభ్రంగా ఉంచే కార్మికుల సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మహేష్‌గౌడ్, అమ్మయ్య చౌదరి, బుచ్చిరెడ్డి, వాకర్స్ అసోసియేషన్ నాయకులు యాదగిరిడ్, సాయిబాబా, నరేంద్రబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.